
ఈ వారం కథ

# ఉనికి



—స్వామి

**అవి నేను కాలేజి చదువుతున్న రోజులు!**

**ఒక రోజు నా రూమ్మేట్స్‌తో కలిసి ఫస్ట్‌షోకి పోయాను. యవ్వనం మా నెత్తుట్లో వికసిస్తోంది. మా శరీరంలోంచి తెగిపోయిన భాగంకోసం తడుములాడుకున్నట్లు ఆడపిల్లల వైపు ఆశగా చూసేవాళ్ళం. కోర్కెల పడగల కింద మా నిద్రలు, మమ్మల్ని పగలంతా బంధించి వుంచిన సామాజిక కట్టు బాట్లని పటపట తెంచుకుని పారి పోయేవాళ్ళం ఏవేవో తియ్యని రాత్రి కలల్లోకి!**

సినిమా నడుస్తుండగా వరద రాజులు మూడు సార్లు బైటికి వెళ్ళొచ్చాడు. 'ఏమిరా విశేషం' అంటే నవ్వు తాడుగానీ చెప్పడు. ఇంటర్వల్ తరువాత మోహన్‌గానితోనూ సత్యంతోనూ గుసగుసలాడడం ప్రారంభించాడు.

పది నిమిషాల తరువాత నా చెవిలో రహస్యంగా ఊదాడు- "పిల్ల దొరికిందిరా! భలే సర్కువాలిటీ! వస్తావా?" ఛత్ అన్నాను. "డబ్బుపెట్టి ఒళ్ళు కొనుక్కోవడం పరమనీచంరా" అన్నాను. ఆ మాటని నేను పోజు కోసం అన్లేదు. నిజంగానే అన్నాను.

అప్పటికి రెండు నెలల క్రితం హైదరాబాద్ వెళ్ళినప్పటి మాట! ఒక రోజు అబిడ్స్ బస్ స్టాపులో నిలబడ్డాను. నా పక్కనే ఒక అందమైన ఆడపిల్ల, చూపులు చూపులు, మధ్య మధ్య నవ్వులు అంతే! నా ఒంట్లో చచ్చిన రాజుకున్న కోర్కె! ఆమె చూసే చూపులు నా కళ్ళల్లో దూరి గుండెలో ప్రవేశించి నా శరీరంలోని అణువణువునీ విద్యుత్ జలపాతాల్తో ముంచెత్తుతున్న హోరు!

ఆమె నావైపు నవ్వుతూ నడిచొచ్చి మాట్లాడిన మొదటి మాటకే అదిరి పోయాను. "వంద రూపాయిలు! వస్తారా? మీ రూము వుంటే సరే! లేక పోతే నాకు తెలిసిన లాడ్జి వుంది. అక్కడికి..."

అంతే! నాలో అప్పటిదాకా లేచిపడుతున్న మంటలు ఒక్కసారిగా నీళ్ళు గుమ్మరించినట్లు చప్పగా అణగిపోయాయి. "డబ్బుపెట్టి స్త్రీని కొనుక్కోవడమా!"

నాకు స్త్రీ స్పర్శ, ఆ సుఖం కావాలి, నిజమే అయితే ఆమె నా అక్కర తీర్చడానికి మాత్రమే అన్నట్లు ఉండకూడదు. తనకు నేను కూడా ఎంతో అవసరమైనట్లు వుండాలి. ఇది కూడా నా అహంకారమేనేమో! కాకపోతే సంస్కారం కూడా కొన్ని కొన్ని నీతులకూ ఆదర్శాలకూ గల వేర్లు అహంభావంలోంచే మొదలౌతాయి కాబోలు.

"డబ్బులిచ్చి కొనుక్కున్నా, కళ్ళతో మంత్రించి మోసం చేసి రప్పించుకున్నా రెండిట్లోనూ నైతిక ప్రమాణం ఒకటే. కాకపోతే మొదటి దాంట్లో థ్రిల్లు తక్కువ" అన్నాడు వరద రాజులు ఈజీగా.

నన్ను ఒక్కణ్నే మిగిల్చేసి వెళ్ళి పోతున్నందుకు సారీ చెప్పి ముగ్గురూ బైటికి వెళ్ళిపోయారు.

అరగంట గడిచింది. నాలో కోర్కె నాగుబాములా బుసలు కొడుతోంది-'వాళ్ళు ఈ పాటికి స్వర్గం అనుభవిస్తుంటారు కదా' అనే ఊహతో! ఇక కూర్చోలేక బైటకి వచ్చి థియేటర్ బైట టీతాగి, సిగరెట్టు కాల్చుకుంటూ నిలబడ్డాను.

హఠాత్తుగా థియేటర్ పక్క చీకటి బయల్లోంచి పరుగెత్తుకొచ్చారు ముగ్గురూ! ఒళ్ళంతా చెమటలు పోసి ఆయాసంతో రొప్పుతున్నారు. సత్యమూర్తి ఉత్తకాళ్ళతో వున్నాడు. పరుగెత్తేటప్పుడు స్లిప్పర్లు జారిపోయినట్టున్నాయి.

"ఏం జరిగింది?"

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. మూడు నిమిషాలకు నోరు తెరిచి "పోలీసులురా-" అంటూ గొణిగాడు వరదరాజులు. "పోదాంరా! పోదాం! మళ్ళీ ఇటువైపే వస్తారేమో" సత్యమూర్తి, మోహనూ తొందర చేస్తున్నారు.

రానే వచ్చారు పోలీసులు థియేటర్ పక్క చీకట్లోంచి.వాళ్ళ మధ్య ఆమె! అప్పుడే తొలిసారిగా నేను ఆమెని చూడడం. పోలీసులు గంభీరంగా ముఖంపెట్టి ముందుకు చూస్తూ పోతుంటే, ఆమె వీరి ముగ్గురి వైపూచూసి నవ్వుతోంది.

**సమాజంలో స్త్రీ విలువల్ని నిర్ణయించే శాసించే శక్తులు ఆమె స్త్రీత్వాన్ని పిండుకుని తాగినా ఆమె సహించింది. 'స్త్రీ' అనే ప్రత్యేకతపోయినా 'మనిషి'గా వుండాలని తపించింది. అందుకు ఆమె చేసిన ప్రయత్నం ఎంత చిన్నదైనా ఎంతో గొప్పదే! దయనీయమైనదే! తనను హీనంగా, వేరుగా చూసిన వాళ్ళ మధ్య వుండాలనుకోవడం... హృదయాన్ని కదిలించేదే!**

29-6-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

"మనల్నిచూపిస్తుందేమోరా లం..." సత్యమూర్తి ముఖం చాటుచేసుకుంటూ గొణుగుతున్నాడు. మిగతా ఇద్దరూ తలలు పక్కకు తిప్పి ఎటో చూస్తున్నట్లు నటిస్తున్నారు. ఆమె వెళ్ళిపోయినా వీరివైపు ఆమె నవ్వుతూ చూసిన చూపే నన్ను వెంటాడుతోంది. ఆ ముఖంలో నిర్లిప్తి, పోలీసుల వేధింపూ, కోర్టు తీర్పులూ అలవాటైపోయిన నిర్లక్ష్యం.

ఎక్కడి నుంచి ఎలా ఎందుకు వచ్చి పడిందో ఈ నరక కూపంలో! రేపు మీద ఆశలేక,పగలూరాత్రీ భేదం తెలీక, చెమటోడ్చి కష్టిస్తూ, ఏ మలుపూలేని ఎడారి బ్రతుకుల్లో, గుడిసెల్లో గుడ్డి దీపం వెలుతురు కింద ఆరేసుకున్న ఆనయ వాళ్ళి పొద్దున్నే దులుపుకుంటూ, మళ్ళీ మడతలుపెట్టే భద్రపరుచు కుంటూ, మెదడూ మనసూ బతుకూ తనువూ తుప్పపట్టి పోయి, చచ్చే వరకూ బతక గలగడమే జీవితానికి ఒక మహోలక్ష్యమై పోయి, ఏ వంపులూ జిలుగులూ లేని యాంత్రికత్వం కింద నలుగుతూ, ఏ శుభవార్తలకూ తావులేని జీవిత కాలాన్ని నిర్లక్ష్యంగా మోస్తూ... ఈ నికృష్ట జీవితాలకు ఎక్కడ అంతం- మరణంలో తప్ప!

వీళ్ళకు గనక లైసెన్సులు ఇస్తే- పాపం! మన పోలీసు డిపార్టుమెంటుకు ఆదాయాలు తగ్గిపోవా?

మూడేండ్లు గడిచాయి.

ఒకరోజు సెకండ్‌షో సినిమా చూసి వస్తుంటే టీ కొట్టు దగ్గర ఆమె! ఆ శరీరంలో మునుపటి పొంకం లేదు. ఆకర్షణ లేదు. లోతుకు పీక్కుపోయి ఎముకలు తేలే చెంపలు మీద అసహ్యపు పొడరు మరకలు కొబ్బరి పీచులా మారిన జుట్టులో ఆమె తురుముకున్న మల్లెపూలు, మల్లె పువ్వుల్లాలేవు- తన వ్యాపారానికి ఒక పావలా పెట్టుబడి పెట్టే నట్లుంది. గాజుగ్లాసులోని టీ లో బన్ను ముంచుకుని తింటోంది! ఆ రాత్రికి అదే భోజనమైనట్లు...

ఆమె పోబోతుంటే ఎవరో నలుగురు మోటు మనుషులు వెకిలి సరసాలు ప్రారంభించారు. సారా కంపు! ఒకడు ఆమె చెంపలు నిమిరాడు. ఒకడు ఆమె వీపు నిమిరాడు. భుజాలపైకి పోయిన చేతులు, ఆమె తొడలపైకి పోతున్న చేతులు, చప్పున లాగి పారేసిన పైట! ఆమె మగవాళ్ళ మధ్య కూలబడి గొల్లు మంటూ ఏడ్చిన ఏడ్పు. "దీని ఏడ్పుచూడరా పతివ్రత అయినట్లు!" నగలబడి నవ్వుతున్నారు. అంతే! పైట సర్దుకుంటూ సివంగిలా లేచింది,ఏడ్పుగొంతుతోనే అరిచింది గట్టిగా!

"లంజనేరా! నేను లంజనే! లంజనైతే మాత్రం నడిరోడ్లో బట్టలిప్పుకోవాలా? మాకు మాత్రం సిగ్గూ శరమూ వుండవా? లంజ మాత్రం ఆడదికాదా? ఆడదాన్నిరా! నేను కూడా ఆడదాన్ని!" పిడికిళ్ళు బిగించి బూతులు తిట్టడం ప్రారంభించింది రోషంగా!

ఆమెకు తన శీలం గూర్చిన స్పృహ ఏనాడో పోయింది. 'నేను ఒక స్త్రీ'ని అన్న ప్రాథమిక స్పృహను వదలుకోవడానికి మాత్రం ఆమె ఇంకా సిద్ధపడలేదు.

మరో రెండేళ్ళు గడిచిపోయాయి. అవి పొరుగు దేశంతో యుద్ధం జరుగుతున్న రోజులు. వలస వచ్చిన కాందిశీకుల్ని మానవతాదృష్టితో ఆదుకోవడానికి ముందుకురండని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది ప్రజలకు. 'దేశ రక్షణ నిధికి విరివిగా విరాళాలు ఇవ్వండి" అని వీధి వీధిలోనూ చందాలు వసూలు చేస్తున్న వాలంటీర్లు.

శ్రీకంఠం టాకీసుపక్క సందులోని ఇళ్ళన్నీ తిరుగుతూ చందాలు వసూలు చేస్తున్నారు కొందరు యువకులు. ఆ పక్కనే వున్న గుడిసెల్లోకి మాత్రం ఎవరూ వెళ్ళడం లేదు చందాల కోసం. మనుషుల్లో రహస్యంగా ప్రవహించే కోర్కెలకు డ్రెయినేజి వంటివి ఆ గుడిసెలు.

ఆ గుడిసెల్లోంచి పరుగెత్తు కొచ్చింది ఒక ఆమె రూపాయి నోటు చేత్తోపట్టుకుని.

"ఇదిగో చందా. నేను రూపాయి ఇస్తున్నాను" అంటోంది. యువకులంతా తెల్లబోయి నిలబడ్డారు. పరీక్షగా చూశాను. ఆమె! ఆమే!! సందేహం లేదు. కడుపుకోసం బతుక్కోసం హీనాతి హీనంగా మోసపోతూ, పతితుల్ని రూపాయి కాగితాల్ని వెదుక్కుంటూ, ఆకలితో పీక్కుపోయిన ముఖంలోంచి ముందరి పళ్ళు బైటపడి తొంగి చూస్తున్న వికృతత్వం,

"నేను... నేనుకూడా ఇస్తున్నాను చందా తీసుకోండి. ఇది దొంగ సొమ్ముకాదు; నేను కష్టపడి సంపాదించిన డబ్బు! తీసుకోండి!"

ఒక యువకుడు ఆమె ముఖంలోకి చూసే ధైర్యం లేక తలొంచుకుని సిగ్గుపడుతూ అందుకున్నాడు ఆమె చేతినుంచి నోటుని.

గర్వంతో మెరిశాయి ఆమె కళ్ళు. ఉద్వేగంతో, దేశ భక్తితో ఆమె నోరు తెరిచి ఏదో మాట్లాడుతుంటే యువకులంతా చల్లగా పక్కకి జారుకున్నారు. ఆమె పిచ్చిపట్టిన దానిలా తనకుతానే గట్టిగా మాట్లాడు కుంటూ చేతులు తిప్పుకుంటూ వెళ్ళి పోయింది తన గుడిసెల్లోకి.

ఆమెలోని దేశభక్తి ఎంతగొప్పదైనా కా... మొత్తం జాతి జాతినే విద్యుదీకరించే ఆ చారిత్రక సన్ని వేశాల్లో- ఒక సమిష్టి చేత నోధృతిలో తాముకూడా ఒక భాగం పంచుకోవడం ద్వారా ఆమె తన ఉనికిని సమాజంలో గుర్తింప జేసుకోవడానికి పడే తాపత్రయమే నన్ను ఎక్కువగా కదిలించివేసింది.

